సాక్షి
ప్రకాశం

ఆదివారం । 7 । జనవరి । 2024



అసత్య ప్రచారంలో బాబు దిట్ట
వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై చంద్రబాబు నాయుడు అసత్య ప్రచారాలు చేస్తున్నారని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ విమర్శించారు.
- 8లో..



నలుగురు బైక్ దొంగల అరెస్టు
చెడు వ్యసనాలకు బానిసలైన నలుగురు బాలురు బైకులను దొంగిలిస్తూ పోలీసులకు చిక్కారు.వారి నుంచి 6 బైకులు స్వాధీనం చేసుకున్నారు.
- 8లో..

గరిష్టం/కనిష్టం
29/21

వాతావరణం
ఉదయం మంచు ఎక్కువగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీలు 9వ తేదీ లోగా విధుల్లో చేరాలి

ఒంగోలు: ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు ఈ నెల 9వ తేదీ లోగా విధుల్లో చేరాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సేవలను ఎస్మా చట్ట పరిధిలోకి జీఓ 2 ద్వారా ఈ నెల 6వ తేదీ ప్రకటించిందన్నారు. జిల్లాలో 13 ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీల్లో విధులు నిర్వహిస్తూ డిసెంబర్ 12వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు వెంటనే సమ్మెను విరమించి ఈ నెల 9వ తేదీలోపు విధుల్లో చేరాలని కోరారు. లేకుంటే చట్టపరిధిలో తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

మొదటి సెమిస్టర్ మూల్యాంకనం ప్రారంభం

ఒంగోలు: ఆంధ్రకేసరి యూనివర్శిటీ మొదటి సెమిస్టర్ పరీక్షల మూల్యాంకనం స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ప్రారంభమైందని క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ డి.కళ్యాణి తెలిపారు. శుక్రవారం నుంచి తెలుగు, ఆంగ్ల పరీక్షల మూల్యాంకనం చేస్తున్నామన్నారు. సోమవారం నుంచి ఆర్ట్స్, కామర్స్, సైన్స్ సబ్జెక్టుల పేపర్ల మూల్యాంకనం మొదలవుతుందన్నారు. పొదిలి, దర్శి, అద్దంకి, ఒంగోలు ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులంతా రిలీవింగ్ తీసుకుని మూల్యాంకనానికి హాజరుకావాలన్నారు.

విజ్ఞానాన్ని పంచే దివ్య మందిరం గ్రంథాలయం

ఒంగోలు టౌన్: సమాజంలో విజ్ఞాన జ్యోతులను వెలిగించి ప్రజలకు దిశానిర్దేశం చేసేది గ్రంథాలయాలే అని రిటైర్డ్ సబ్ కలెక్టర్ ఎం పేరయ్య అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మనం-మన గ్రంథాలయం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ర్యాకుల్లోని పుస్తకాలను సక్రమంగా సర్ది నీటుగా అమర్చారు. గ్రంథాలయంలోని పత్రిక విభాగం, కంప్యూటర్ విభాగాలను పరిశుభ్రం చేశారు. అనంతరం పేరయ్య మాట్లాడుతూ...గ్రంథాలయాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చిన్న వయసు నుంచే పిల్లలను గ్రంథాలయాలకు తీసుకెళ్లి పుస్తకాలను చదవించడం లాంటి మంచి అలవాట్లను నేర్పాలని తలిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పుస్తకాలను చదవడం వల్ల పిల్లలకు మంచి వ్యక్తిత్వం అలవడుతుందన్నారు. బాధ్యత కలిగిన పౌరులుగా తయారతారని చెప్పారు. పాఠకులతో కలిసి గ్రంథాలయ పరిసరాలను పరిశుభ్రం చేయడం సంతృప్తిని కలిగిస్తుందని ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ఎం శ్రీనివాసులు, శివకుమారి, అనిల్ కుమార్, పి.స్మైలీ, లక్ష్మీ, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

పరిహారం.. ఉదారంగా..

తుఫాన్లు..అకాల వర్షాలు..వరదలతో నష్టపోయిన రైతులకు అండగా నిలుస్తోంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు ప్రకృతి విపత్తుతో దెబ్బతిన్న పంటలకు వెంటనే పరిహారాన్ని అందజేస్తోంది. మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో ఏర్పడిన పంటనష్టాన్ని జిల్లా యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన గుర్తించింది. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి అధికారుల వరకూ అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలు సిద్ధం చేసింది. జిల్లాలో 3775 మంది రైతులకు రూ. 2.82 కోట్ల పరిహారాన్ని ఇవ్వాలని ప్రభుత్వానికి నివేదిక పంపింది. త్వరలో పరిహారాన్ని పంపిణీ చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

- ఆగమేఘాలపై మిచాంగ్ నష్టం అంచనాలు సిద్ధం
- తుఫాన్ వెళ్లిన రెండు వారాల్లోనే నివేదిక
- అన్నదాత పక్షాన స్పందించిన ప్రభుత్వం
- 3775 మంది రైతులకు రూ.2.82 కోట్ల మంజూరుకు ప్రతిపాదనలు



ఒంగోలు సెంట్రల్: చంద్రబాబు పాలనలో తుఫాన్లు వస్తే రైతులు వణికి పోయేవారు. పంట దెబ్బతింటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగేవారు. తెలుగు తమ్ముళ్లు చెప్పిన పేర్లతోనే జాబితా తయారయ్యేది. సీజన్లు గడిచి పోయినా పరిహారం అందుకోవడం గగనమయ్యేది. ఏడాదికో, ఏడాదిన్నరో పరిహారం విడుదలైనా 10 నుంచి 20 శాతం జన్మభూమి కమిటీలకు కమీషన్లు ముట్టజెప్పాల్సి వచ్చేది. కానీ నేడు ఆ పరిస్థితి మారింది. విపత్తులు సంభవించిన వెంటనే అధికారులు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పారదర్శకంగా నష్టాన్ని అంచనా వేసి నివేదికలను వెంటనే ప్రభుత్వానికి అందజేస్తున్నారు. నష్టపోయిన అన్నదాతలకు అదే సీజన్‌లో పరిహారం అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. గడిచిన నాలుగున్నరేళ్లలో ఇదే పద్ధతిలో రైతులకు అండగా నిలిచింది. మిచాంగ్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలకు కూడా సీజన్ ముగియకుండానే పరిహారం జమ చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో చర్యలు తీసుకుంటోంది. మిచాంగ్ తుఫాన్ వెలిసిన వెంటనే పంట నష్టం వివరాల లెక్క తేల్చేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో వడివడిగా పనిచేశారు. నష్టం అంచనాలతో రూపొందించిన జాబితాలను వ్యవసాయశాఖ అధికారులు సిద్ధం చేశారు. ఏ మండలంలో, ఏ గ్రామంలో ఏ పంట ఎంత దెబ్బతిందో తెలుపుతూ రైతుల వివరాలను పొందుపరిచారు. ఈ జాబితాను సామాజిక తనిఖీ అనంతరం తుది జాబితాను ప్రదర్శించారు. సంక్రాంతి పండుగకు ముందుగానే పంట నష్ట పరిహారాన్ని రైతులకు అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా యంత్రాంగాన్ని కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు.

అధికారంలోకి వచ్చిన నాటి నుంచి..
2019 ఆగస్టులో, అక్టోబర్‌లలో సంభవించిన భారీ వర్షాలకు, 2020 జనవరి, ఫిబ్రవరి, ఏప్రియల్, సెప్టెంబర్, అక్టోబర్, నివార్ తుఫాన్‌కు సంభవించిన నష్టాలకు, 2021లో నవంబర్‌లో 2020 సెప్టెంబర్‌లో , 2022 డిసెంబర్‌లో సంభవించిన మాండూస్ తుఫాన్, 2023 మార్చిలో అకాల వర్షాలకు సంభవించిన నష్టాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్పందించి ఇన్‌పుట్ సబ్సిడీలు అందించింది.

వెను వెంటనే అంచనాల తయారీ
మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో డిసెంబర్ 3వ తేదీ నుంచి 5వ తేదీ భారీ వర్షాలు కురిసాయి. ఈ వర్షాలకు 8 నియోజక వర్గాల పరిధిలో 3775 మంది రైతులకు చెందిన 4,975.9 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు గుర్తించి ఇన్‌పుట్ సబ్సిడీ నిమిత్తం ప్రభుత్వ ఆమోదానికి పంపారు.

పంట నష్ట వివరాలు

పంట	రైతుల సంఖ్య	విస్తీర్ణం (ఎకరాలు)	ఇనుపుట్ సబ్సిడీ (రూ.)
వరి	2584	2799.2	1,90,34,560
మొక్కజొన్న	394	518.525	25,92,625
కంది	1	4.15	16,600
అలసంద	3	12.5	50,000
మినుము	492	817.37	32,69,500
పొగాకు	266	749.4	29,97,600
వేరుశనగ	1	5	34,000
నువ్వులు	34	69.75	2,37,150
మొత్తం	3775	4975.9	2,82,32,035

సమయానికి రైతులను ఆదుకున్నారు



గత ప్రభుత్వంలో రైతులనూ ఏ నాడు పట్టించుకోలేదు. జగనన్న ప్రభుత్వంలో ఇన్సూరెన్సు చెల్లించి ఆ తర్వాత ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం వాటిల్లితే రైతులకు అండగా ఉంటున్నారు. పంట నష్టపోయిన రైతులకు అదే సీజనల్‌నే ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తున్నారు. ఈ క్రాప్ రైతులకు ఎంతో మేలు చేస్తుంది.

– టి.పెద్దిరెడ్డి,రైతు, మాధవరం

రైతులకు అండగా ప్రభుత్వం



ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుంది. గత నాలుగేళ్లలో 1,83,793 మంది రైతులకు రూ.146.33 కోట్లు ప్రభుత్వం అందించింది. మిచాంగ్ తుఫాన్ ఇన్‌పుట్ సబ్సిడీ సైతం అంచనాలు తయారు చేసి పంపాం. ఆర్‌బీకేలు నిత్యం రైతులను సేవలందిస్తున్నాయి.

– ఎస్ శ్రీనివాసరావు, జెడీఏ ఒంగోలు.



పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు



పొన్నలూరులో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

అభినవ అంబేడ్కర్ సీఎం జగన్

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- పొన్నలూరులో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ

పొన్నలూరు: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలకు సామాజిక న్యాయంతో పాటు వారి జీవన స్థితిగతుల మార్పు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినవ అంబేడ్కర్‌గా పాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కొత్తగా మంజూరైన వైఎస్సార్ పింఛన్లను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి సురేష్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీలు ప్రకారం 99 శాతం వాగ్దానాలను పూర్తి చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు 600 హామీలిచ్చి ఒక్క హామీని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. పింఛన్‌ను విడతల వారీగా రూ.3 వేలు చేసి వృద్ధులు, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు సామాజిక ఆర్థిక భరోసా కల్పించిన ఘనత దేశంలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను తలుపు తట్టి ప్రభుత్వం ప్రజలకు అందిస్తుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పార్టీ కండువా మెడలో వేసుకుంటే గానీ ప్రభుత్వ పథకాలు అందేవని, కానీ నేడు జగనన్న ప్రభుత్వంలో పార్టీలు, కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు ఇంటి వద్దకే చేరుతున్నాయన్నారు.

పారదర్శకంగా రూ. 2.50 లక్షల కోట్లు నగదును డీబీటీ పద్ధతి ద్వారా అన్ని సామాజిక వర్గాల సంక్షేమానికి లబ్ధి చేకూరేలా వారి బ్యాంకు ఖాతాలను జమ చేశారన్నారు. విద్య దూరమైన పేద వర్గాల కోసం ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చి ఇంగ్లిష్ మీడియంతో పాటు సాంకేతిక, ఉన్నత విద్యను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలను ఓటు బ్యాంకుగా చూస్తే, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల గుండె సవ్వడి తెలిసిన వ్యక్తిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించిన మార్గంలో నడుస్తూ చట్ట సభల్లో ఉన్నత పదవులు ఉన్నత పదవులు కట్టబెట్టారన్నారు. పచ్చ మీడియా ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లుగా చూపిస్తూ ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు నమ్మరన్నారు.

గజమాలతో భారీ స్వాగతం...
కొండపి నియోజకవర్గ నూతన ఇన్‌చార్జిగా నియమించిన తర్వాత మంత్రి సురేష్ మొదటి సారి పొన్నలూరుకు రావడంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా చేరుకొని స్వాగత ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ముప్పా కోటేశ్వరరావు, నవులూరి మధు క్రేన్‌తో ఏర్పాటు చేసిన 20 అడుగుల గజమాలతో మంత్రి సురేష్‌కు ఘన స్వాగతం పలికారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం సురేష్ బస్టాండ్ సెంటర్ నుంచి ఎంపీడీఓ కార్యాలయంలోని సభా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ చేపట్టారు.

విమర్శకులకు ప్రజలే బుద్ధి చెబుతారు...
తాను కొండపి నియోజకవర్గానికి రావడాన్ని వలస పక్షిగా కొందరు విమర్శిస్తున్నారని ఇలాంటి వారికి రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని మంత్రి సురేష్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ విలువలు, స్ఫూర్తిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్నారని, అందుకే నాలాంటి దళిత ప్రజా ప్రతినిధులకు ఉన్నత పదవులు వస్తున్నాయని కొనియాడారు. కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ పటిష్టంగా ఉందని, అందుకే కొందరు ఓటమి భయంతో పసలేని విమర్శలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆశీస్సులు, జగనన్న అండదండలు, కొండపి నియోజకవర్గ ప్రజల దీవెనలతో తప్పక నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీఓ కల్పన, మాజీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, సంగమేశ్వర దేవస్థానం చైర్మన్ బూచిరాజు మాల్యాద్రి, సొసైటీ అధ్యక్షుడు గొల్లపూడి రవణయ్య, గొర్రెపాటి మహేష్, కో ఆప్షన్ సభ్యులు ఎస్‌కే రసూల్, వైఎస్ ఎంపీపీ అనుమోలు శివయ్య, మాజీ నీటి సంఘం అధ్యక్షులు కంచర్ల రవణయ్య, దాసరి రవి, సిరిగిరి గోపాల్‌రెడ్డి, మన్నెం చిన వెంకటేశ్వర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రూడ్‌సెట్ ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ రిపేర్ శిక్షణ

ఒంగోలు టౌన్: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ఒంగోలు భాగ్యనగర్‌లోని గ్రామీణాభివృద్ధి, స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (రూడ్‌సెట్) ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ రిపేరులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరక్టర్ పి. ప్రతాప్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన గ్రామీణ ప్రాంత యువకులు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 94925 83484 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మోసాల బాబును ప్రజలు నమ్మరు

- ఆల్ ఫ్రీ పోయి..ఆరు ఫ్రీకి వచ్చావా..
- 14 ఏళ్ల పాలనలో కనిగిరి కన్పించలేదా..?
- వెలిగొండపై చంద్రబాబువి పచ్చి అబద్ధాలు
- కష్టపడి పైకొచ్చా..నీలాగా రాజకీయాల్లో దోచుకోలేదు
- టీడీపీ పాలన అంతా దోచుకో.. దాచుకో..
- విలేకరుల సమావేశంలో చంద్రబాబుపై ఎమ్మెల్యే బుర్రా ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: ' మొన్న ఆల్ ఫ్రీ అన్నావ్.. ఇప్పుడు ఆరు ఫ్రీ అంటున్నావ్.. 14 ఏళ్ల పాలనలో ప్రజలకు ఏం చేయలేని చంద్రబాబు ఇప్పుడు కొత్త డ్రామాలు ఆడుతున్నాడని' ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికలప్పుడు అరచేతిలో వైకుంఠంలా హామీలు ఇవ్వడం..ఆ తర్వాత వాటిని విస్మరించడం చంద్రబాబు నైజమన్నారు. అబద్ధాల బాబు ఆపు నీ నాటకాలు అంటూ తీవ్రంగా మండిపడ్డారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ప్రకాశం జిల్లా అభివృద్ధికి, కనిగిరి అభివృద్ధికి ఏం చేయలేదన్నారు. ఇప్పుడు వచ్చి కనిగిరి కేంద్రంగా అభివృద్ధి చేస్తానంటూ ప్రజలను మోసం చేస్తున్నాడని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 35 సంక్షేమ పథకాల ద్వారా పార్టీల కతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదన్నారు. నలభైఏళ్ల రాజకీయ చరిత్ర అని చెప్పుకునే చంద్రబాబు తక్కువ ధరకు కాస్ట్‌లీ మద్యాన్ని అందిస్తానని..తాగుడును ప్రోత్సహించేలా మాట్లాడటాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు.

చంద్రబాబు పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం
చంద్రబాబు హయాంలో బీసీలను ఓటు బ్యాంకుగానే వాడుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బీసీలకు ఉన్నత పదవులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, రాజ్యసభ సభ్యులను చేసి రాజ్యాధికారంలో భాగస్వాములను చేశారని ఎమ్మెల్యే బుర్రా అన్నారు. బీసీలంటే బ్యాక్ వర్డ్ కాదు, బ్యాక్ బోన్‌గా అభివర్ణించిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు.

వెలిగొండపై చంద్రబాబువి పచ్చి అబద్ధాలు
వెలిగొండ ప్రాజెక్టు గురించి చంద్రబాబు నిస్సిగ్గుగా పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నాడని ఎమ్మెల్యే బుర్రా తీవ్రంగా మండిపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని, చంద్రబాబు పాలనలో కనీసం 10 శాతం పనులు కూడా జరగలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే 90 శాతం ప్రాజెక్టు పనులు పూర్తయినట్లు చెప్పారు. త్వరలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు వెలిగొండ జలాలు అందిస్తారని చెప్పారు. రూ.130 కోట్లతో కనిగిరి రక్షిత మంచినీటి పథకం పనులు జరుగుతున్నాయని తెలిపారు.

కష్టపడి పైకొచ్చా..
నేను గంజి తాగి బతికాను. కష్టపడి సంపాదించి బెంజిలో తిరిగాను. ప్రత్యేక విమానంలో తిరిగాను. ఆ తర్వాతే రాజకీయాల్లోకి వచ్చాను. మీరు రాజకీయాల్లోకి వచ్చింది ఎప్పుడు.? రెండు ఎకరాల మీ ఆస్తి ఎక్కడ..ఇప్పుడు మీ పరిస్థితి ఏంటి..? అంటూ ఎమ్మెల్యే బుర్రా చంద్రబాబుపై ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. తాను రాజకీయాల్లోకి కోటీశ్వరునిగా వచ్చానని, నీతి నిజాయితీగా కనిగిరిలో రాజకీయం చేస్తున్నట్లు చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి దిగజారుడు మాటలు మాట్లాడాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. టీడీపీ హయాంలో దాచుకో..దోచుకో తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. కరోనా కష్ట కాలంలో టీడీపీ నేతలు ఎక్కడికెళ్లారని ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఏఎంసీ చైర్మన్ సాల్మన్ రాజు, ఎంపీపీలు దంతులూరి ప్రకాశం, అత్యాల జఫన్య, వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శిలు తమ్మినేని సుజాత, గంగసాని హుస్సేన్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు, కౌన్సిలర్లు, ఇతర నేతలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

పెద్దారవీడు: గుర్తు తెలియని వ్యక్తిని వేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన పెద్దారవీడు మండల పరిధిలోని దేవరాజుగట్టు సమీపంలో మాధవరెడ్డి స్కూల్ వద్ద శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కంభం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయసు సుమారు 75 ఏళ్లు ఉంటుంది. తెల్ల చొక్కా, తెల్ల పంచె, గోధుమ రంగు శాలువా ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. వివరాల కోసం పోలీసులు చుట్టు పక్కల గ్రామాల్లో ఆరా తీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ

ఒంగోలు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని డీఎంహెచ్ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి సూచించారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆరోగ్య విద్య మీడియా అధికారుల అసోసియేషన్ ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. జిల్లాలోని ఆరోగ్య విద్య మీడియా అధికారులు, ఆరోగ్య విద్యా బోధకులు, విస్తరణాధికారులు తమ పరిధిలో ఆరోగ్య కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పత్రికల్లో ప్రచురణ అయ్యేలా చూడాలన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఈఈఓ డాక్టర్ నాగార్జున, మాస్ మీడియా ఉప అధికారి శ్రీనివాసులు, ఎం.సరోజిని, కె.శ్రీదేవి, వెంకటరావు, డీవీ శ్రీనివాసులు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అసత్య ప్రచారంలో చంద్రబాబు దిట్ట

- సీఎం వైఎస్ జగన్‌ది జవాబుదారీ ప్రభుత్వం
- అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం
- చెప్పింది చేయడమే సీఎం జగన్ లక్ష్యం
- మర్రిపూడి మండలంలో తాగు, సాగు నీరు, ఘాట్‌రోడ్‌కు రూ.40 కోట్లు
- వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమంలో మంత్రి సురేష్



డ్వాక్రా మహిళలకు స్త్రీనిధి చెక్కు అందజేస్తున్న మంత్రి సురేష్

మర్రిపూడి: సామాజిక సాధికారతే లక్ష్యంగా పనిచేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు అసత్య ప్రచారాలు చేస్తున్నారని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి, వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్ విమర్శించారు. పచ్చ పత్రికలను అడ్డు పెట్టుకుని పదేపదే అబద్ధాలు అచ్చు వేయిస్తున్నారని దుయ్యబట్టారు. శనివారం మర్రిపూడి మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. 175 సీట్లుకుగానూ 151 సీట్లలో గెలిచిన వైఎస్సార్ సీపీ జవాబుదారీతనంతో పనిచేస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా భావించి కుల, మత,పార్టీలకు అతీతంగా పాలన సాగిస్తోందని పేర్కొన్నారు. వలంటీర్ల ద్వారా అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ప్రతి నెలా ఠంచన్‌గా పింఛను ఇస్తూ దేశంలోనే మొదటి స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉందన్నారు. కరోనా మహమ్మారిని సైతం ఎదుర్కొని సంక్షేమ పథకాలు నిరాటంకంగా అమలు చేసినట్లు గుర్తు చేశారు. నాడు- నేడు, విద్యా, వసతి దీవెన పథకాలతో పేద విద్యార్థులకు సీఎం వైఎస్ జగన్ బాసటగా నిలిచారని కొనియాడారు. రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ఏకంగా 1.35 లక్షల ఉద్యోగాలు ఇచ్చారన్నారు. మహిళల పేరుతో ఇళ్ల పట్టాల పంపిణీ అభివృద్ధి కాదా అని ప్రతిపక్ష నేత చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో కులాల మధ్య చిచ్చుపెట్టడం, అలజడి సృష్టించడం , అబద్ధపు హామీలు ఇవ్వడం చంద్రబాబు నైజమన్నారు. అభివృద్ధిని చూసి ఆదరించండి అని చెప్పడం వైఎస్ జగన్‌కు తప్ప ఏ నాయకుడికీ సాధ్యం కాదన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీల సంఘ జిల్లా అధ్యక్షుడు, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కొండపి నియోజకవర్గానికి మంత్రి ఆదిమూలపు సురేష్ ఇన్‌చార్జిగా నియమితులు కావడం తమ అదృష్టమన్నారు. అడిగిందే తరువుగా మర్రిపూడి మండలానికి తాగు, సాగునీటి సరఫరాకు రూ.32 కోట్లు, పృథులగిరి ఘాట్‌రోడ్ నిర్మాణానికి రూ.8 కోట్లు వెరసి మొత్తం రూ.40 కోట్లను సీఎం వైఎస్ జగన్ ద్వారా మంజూరు చేయించారని పేర్కొంటూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డ్వాక్రా మహిళలకు మంత్రి చేతులమీదుగా రూ.10.56 కోట్ల చెక్కు, కొత్త రేషన్ కార్డులు, 67 నూతన పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.సుదారాణి, సొసైటీ అధ్యక్షుడు వెంకట్రావు, బీవీ భాస్కర్‌రెడ్డి, ప్రత్యేకాధికారి ఉదయభాస్కర్, తహసీల్దార్ హరిబాబు, ఎంపీడీఓ సుదీప, వైఎస్సార్ సీపీ నాయకులు ఇనుకొల్లు పిచ్చిరెడ్డి, మాచేపల్లి నాగయ్య, బోద రమణారెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, సర్పంచ్ భాస్కర్, ఇనుకొల్లు మాదిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా

చంద్రబాబు హామీలు

- పీడీసీసీబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి ఎద్దేవా


పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి

ఒంగోలు సిటీ: రానున్న ఎన్నికల్లో ఎలాగైనా లబ్ధి పొందాలనే ఉద్దేశంతో చంద్రబాబు హామీలిస్తున్న తీరు చూస్తే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు తీరును తూర్పారబట్టారు. 2014-19 మధ్య కాలంలో ప్రత్యేక హోదాను కాదని రూ.20 వేల కోట్ల ప్యాకేజీకి ఒప్పుకున్న చంద్రబాబు.. ఆ నిధులను నీరు-చెట్టు పేరుతో టీడీపీ నేతలకు పంచారని ధ్వజమెత్తారు. కనిగిరి బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగాన్ని విన్నవారంతా నవ్వుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దులుగా నడిపిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. కనిగిరిని రెవెన్యూ డివిజన్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. వెలిగొండ ప్రాజెక్టును దివంగత వైఎస్సార్ ప్రారంభించి సగానికి పైగా పనులను చేశారని, చంద్రబాబు చేసిందేమీ లేదన్నారు. 2019లో అధికారం చేపట్టిన సీఎం వైఎస్ జగన్ 95 శాతం పనులు చేశారని, మూడు నెలల్లో ప్రాజెక్టును ప్రారంభమవుతుందన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో టీడీపీ ఎమ్మెల్యేలు వెలిగొండ గురించి అడిగినా పట్టించుకోలేదన్నారు. సంక్షేమం, అభివృద్ధిని పట్టించుకోకుండా కేవలం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిట్టేందుకే చంద్రబాబు సభలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి టీడీపీ లాగేసుకున్న చంద్రబాబు కుటుంబంలో నేడు అన్ని పార్టీలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. బాలినేనిపై చంద్రబాబు వ్యాఖ్యలు హాస్యాస్పదమని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బాలినేని పిల్లర్ లాంటి వారన్నారు. చంద్రబాబు దగ్గర ఇమడలేకనే చాలా మంది వైఎస్సార్ సీపీలోకి వచ్చారని గుర్తు చేశారు. చంద్రబాబు ఎన్ని నక్కజిత్తుల వేషాలు వేసినా పశ్చిమ ప్రకాశంలోని ఐదు స్థానాల్లో వైఎస్సార్ సీపీ విజయ ఢంకా మోగిస్తుందన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: సంక్రాంతి పండగ సందర్భంగా బూచేపల్లి యూత్ ఆధ్వర్యంలో చీమకుర్తి మండలంలోని బూదవాడ గ్రామంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను శనివారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రారంభించారు. బ్యాటింగ్, బౌలింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. క్రీడా పోటీల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, స్థానిక సర్పంచ్ జనరాజుపల్లి మరియమ్మ సామ్యేల్, చిన్నపురెడ్డి పాపిరెడ్డి, మాజీ ఎంపీపీ మేదరమెట్ల శ్రీనివాసులు, ధర్మవరపు సంజీవరెడ్డి, జనరాజుపల్లి యాకోబు, దుద్దుకూరు వెంకట్రావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నలుగురు బైక్ దొంగల అరెస్టు

- 6 మోటారు సైకిళ్లు స్వాధీనం
- నిందితులందరూ 16 ఏళ్లలోపువారే
- వివరాలు వెల్లడించిన మార్కాపురం సీఐ


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, పక్కన ఎస్సై కోటేశ్వరరావు


పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటారుసైకిళ్లు

మార్కాపురం: చదువుకోవాల్సిన వయసులో చెడు వ్యసనాలకు బానిసలైన నలుగురు బాలురు ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన బైకులను దొంగిలిస్తూ పోలీసులకు చిక్కారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి 6 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ అవుల వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం సాయంత్రం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చోరీ కేసు వివరాలను సీఐ వెల్లడించారు. సీఐ మాట్లాడుతూ.. పట్టణంలో బైక్ దొంగతనాలపై ప్రత్యేక బృందంతో నిఘా పెట్టామన్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు బాలురను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా బైక్ దొంగతనాలకు పాల్పడినట్లు నేరం అంగీకరించారని తెలిపారు. మార్కాపురం పట్టణంలో 3, రూరల్ పరిధిలో ఒకటి, పెద్దారవీడులో ఒకటి, కంభం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక బైకును చోరీ చేసినట్లు నిందితులు విచారణలో వెల్లడించారని చెప్పారు. నిందితులందరూ మార్కాపురం పట్టణవాసులేనని, 16 ఏళ్ల లోపు పిల్లలు కావడంతో జువైనల్ జడ్జి ముందు హాజరుపరిచినట్లు తెలిపారు. సరైన పత్రాలు లేకపోయినా తక్కువ ధరకు వస్తున్నాయని సెకండ్ హ్యాండ్ వాహనాలు కొనుగోలు చేసిన వారిని కూడా ఈ కేసులో నిందితులుగా చేర్చినట్లు వెల్లడించారు. సమావేశంలో పట్టణ ఎస్సై కోటేశ్వరరావు పాల్గొన్నారు.

క్విస్ కాలేజీ అధ్యాపకుడికి పీహెచ్‌డీ

- ఇస్రో చైర్మన్ చేతులమీదుగా ప్రదానం



ఇస్రో చైర్మన్ నుంచి పీహెచ్‌డీ అందుకుంటున్న చంద్రశేఖర్

ఒంగోలు: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ లెక్చరర్ డాక్టర్ కె.చంద్రశేఖర్ పీహెచ్‌డీ అందుకున్నారు. మెకానికల్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఈనెల 5న జేఎన్‌టీయూ హైదరాబాద్ స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ శ్రీధర పనికర సోమనాథ్, యూనివర్సిటీ వీసీ కట్టా నరసింహారెడ్డి చేతులమీదుగా పీహెచ్‌డీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక క్విస్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, వైస్ చైర్మన్ నిడమానూరి గాయత్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు తదితరులు అభినందించారు.

ఇనమనమెళ్లూరులో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

మద్దిపాడు: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో వాకా కోటిరెడ్డి యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు గడ్డె జాలయ్య తెలిపారు. మొదటి బహుమతి రూ.50,116ను మండల వైఎస్సార్ సీపీ నేత పోతినేని శ్రీనివాసరావు, రెండో బహుమతి రూ.29,116ను ఇనమనమెళ్లూరు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు రవి, గోపి శ్రీనివాసరావు, ఆకుల శ్రీనివాసరావు, వెంకటశేషయ్య, కోటి, మూడో బహుమతి రూ.15,116ను సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకులు లింగా రామచంద్రారెడ్డి అందిస్తున్నారని వివరించారు. ప్రవేశ రుసుం రూ.1500ను 9849341159కు ఫోన్ పే లేదా గూగుల్ పే చేసి జట్టు వివరాలు రెండు రోజుల్లోగా నమోదు చేసుకోవాలని సూచించారు.

పొగాకు రైతులకు రూ.10 వేల వడ్డీ లేని రుణం

ఒంగోలు సెంట్రల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పొగాకు పంట నష్టపోయిన రైతులకు టుబాకో బోర్డు రైతు సంక్షేమ నిధి నుంచి రూ.10 వేలు వడ్డీ లేని రుణం మంజూరు చేయనున్నట్లు రీజినల్ మేనేజర్ లక్ష్మణరావు తెలిపారు. దక్షిణ ప్రాంత తేలిక, నల్ల రేగడి నేలల్లో పంట దెబ్బతిన్న జాబితాల్లో పేరున్న రైతులు వేలం కేంద్రం అధికారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఆర్ఎం సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి


మృతి చెందిన మస్తాన్‌వలి

సంతమాగులూరు(అద్దంకి రూరల్): విధి నిర్వహణలో భాగంగా ద్విచక్ర వాహనంపై వస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ ఘటన సంతమాగులూరు మండలంలో శనివారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని ఏల్చూరు సచివాలయం-2లో ఎస్‌కే మస్తాన్‌వలి (45) వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా ద్విచక్రవాహనంపై ఆవులమంద గ్రామానికి వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో వినుకొండ నుంచి నరసరావుపేట వెళ్తున్న ఆర్టీసీ బస్సు కామేపల్లి వద్ద బైక్‌ను ఢీకొట్టడంతో మస్తాన్‌వలి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హాకీ జిల్లా బాలుర జట్టు ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

ఒంగోలు: హాకీ బాలుర జూనియర్ జిల్లా జట్టు ఎంపిక పోటీలను శనివారం స్థానిక డీఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. క్రీడాకారుల ప్రతిభను పరీక్షించి జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు తిరుపతిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్‌లో పాల్గొంటుందని హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సుందరరామిరెడ్డి తెలిపారు. జిల్లా జట్టు ఎంపికను అసోసియేషన్ సభ్యులు ఎస్.చంద్రశేఖర్, టి.రవికుమార్, పి.రవి పర్యవేక్షించారు.

స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు భవనాల పరిశీలన


క్విస్ కాలేజీలో ఏర్పాట్లపై చర్చిస్తున్న డీఆర్ఓ శ్రీలత

ఒంగోలు అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కాలేజీని డీఆర్వో శ్రీలత శనివారం పరిశీలించారు. కాలేజీ నిర్వాహకులతో వివిధ అంశాలపై చర్చించారు. కాలేజీలోని గదులు, వాటి కొలతలపై ఆరా తీశారు. పరిశీలన నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని డీఆర్వో తెలిపారు. ఆమె వెంట ఒంగోలు ఆర్డీఓ విశ్వేశ్వరరావు, తహసీల్దార్ మురళి, ఎన్నికల విభాగం అధికారులు ఉన్నారు.

సాఫ్ట్‌బాల్ జాతీయ పోటీలకు రాష్ట్ర జట్ల పయనం


సాఫ్ట్‌బాల్ జట్లతో అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర బాలబాలికల క్రీడాజట్లు శనివారం ఒంగోలు నుంచి బయలుదేరాయి. ఈ సందర్భంగా స్థానికంగా పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఒంగోలు డీవైఈఓ అనిత రోజ్‌రాణి క్రీడాకారులకు క్రీడా దుస్తులు, షూ అందించారు. జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటాలని ఆకాంక్షించారు. క్రీడలతోపాటు చదువులోనూ రాణించాలని సూచించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.వనజ మాట్లాడుతూ.. బాలబాలికల జట్లు ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు రాజస్థాన్‌లోని బికనీర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నాయని, తప్పకుండా విజేతలుగా తిరిగి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఈటీ అసోసియేషన్ కార్యదర్శి వై.శీనయ్య, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శివశంకర్, జట్టు మేనేజర్లు పి.కౌసల్య, ఎం.రాజ్యలక్ష్మి, టి.త్రినాథ్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం .మోహన్, జి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సోమవారం ఒంగోలుని తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని కార్యాలయ మేనేజర్ భవనం సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలకు అందుబాటులో ఉంటారని, నగరంలో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

టిప్పర్‌ను ఢీకొట్టిన కారు

- ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు


అక్కడికక్కడే మృతి చెందిన కాలేషా

ఉలవపాడు (కందుకూరు): టిప్పర్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ఒకరికి మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఉలవపాడు మండలం జాతీయ రహదారి చాగొల్లు గ్రామ సమీపంలో శనివారం జరిగింది. కందుకూరుకు పట్టణానికి చెందిన షేక్ కాలేషా, ఆయన భార్య జమీలా తన కుమారుడికి పెళ్లి సంబంధం నిమిత్తం కారు బాడుగకు మాట్లాడుకొని నెల్లూరు వెళ్తున్నారు. వీరితోపాటు షేక్ కాలేషా, పెళ్లిళ్ల పేరమ్మ కూడా ఉన్నారు. సింగరాయకొండ వద్ద జాతీయ రహదారి మీదుగా ఉలవపాడు మండలం చాగొల్లు గ్రామం సమీపంలోకి వెళ్లగానే ముందు వెళ్తున్న టిప్పర్ లారీని కారు ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న కారులో షేక్ కాలేషా (65) కారు డోర్‌లో నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్ సయ్యద్ నాగూర్‌వలి, మరో వ్యక్తి షేక్ కాలేషా, జమిలాలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108, హైవే అబులెన్స్‌లో ఒంగోలు తరలించారు. సంఘనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై బాజిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్ నిద్ర మత్తు వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు చెప్తున్నారు.